సాక్షి సూర్యాపేట

సోమవారం । 29 । మే । 2023



కవుల పాత్ర ప్రశంసనీయం

రాష్ట్ర సాధనలో కవుల పాత్ర ప్రశంసనీయమని సాహిత్య అకాడమీ రాష్ట్ర చైర్మన్ జూలూరి గౌరీశంకర్ పేర్కొన్నారు. - 10లో



ప్రభుత్వ పాఠశాలలను..

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42° / 28°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉద్యమాలకు కార్యకర్తలు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

సూర్యాపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీతారామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సూర్యాపేట నియోజకవర్గ స్థాయి సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని ఆరోపించారు. రోబోయే ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలన్నారు. కాగా.. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర పరిస్థితులు అనే అంశంపై బోధించారు. శిక్షణ తరగతులకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎల్గూరి గోవింద్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు మేఘన బోయిన శేఖర్, ధనియాకుల శ్రీకాంత్, వీర బోయిన రవి, నర్సయ్య, రజిత, సైదమ్మ, రామ్‌చరణ్, అంజిబాబు, రాంబాబు, రాంరెడ్డి, అంజయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి శివకుమార్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జూన్ 2నుంచి 12వరకు చేపట్టే దీక్షా దివస్‌ను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని విక్రమ్ భవన్‌లో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎవరి కోసం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తుందో అర్థం కావడం లేదని, ప్రజల సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేయడానికి వివిధ కార్యక్రమాలు తలపెట్టి, అందుకు బడ్జెట్ కూడా కేటాయించిందని ఆరోపించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, పార్టీ జిల్లా నాయకులు గొడ్డలి నర్సయ్య, పేర్ల నాగయ్య, వేర్పుల లక్ష్మయ్య, మట్టపల్లి అంజయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రాంజీ, జీవన్, పద్మ పాల్గొన్నారు

వైభవంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని ఆదివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం, జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచ గవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సదన్ ప్రారంభానికి తరలిరావాలి

నేరేడుచర్ల: హైదరాబాద్‌లో ఈనెల 31వ తేదీన జరిగే బ్రాహ్మణ సదన్ ప్రారంభోత్సవానికి బ్రహ్మణ అర్చకులు భారీగా తరలిరావాలని తెలంగాణ బ్రహ్మణ పరిషత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నంబొట్ల ఫణికుమారశర్మ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా వారు విలేకరులతో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా గోపనపల్లిలో బ్రహ్మణ సదన్ భవన ప్రారంభోత్సవం సీఎం చేతుల మీదుగా ఉదయం 10గంటలకు ఉంటుందన్నారు.

జన్మభూమి రుణం తీర్చుకుంటా



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న వికారాబాద్, సూర్యాపేట ఎస్పీలు కోటిరెడ్డి, రాజేంద్రప్రసాద్

- వికారాబాద్ ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి

మునగాల(కోదాడ): జన్మనిచ్చిన గ్రామ రుణం తీర్చుకునేందుకు శాయశక్తులా కృషిచేస్తానని మునగాల మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన వికారాబాద్ ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి అన్నారు. ముకుందాపురంలో కోటిరెడ్డి సహకారంతో సుమారు రూ.10లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 12 సీసీ కెమెరాలను ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ తాను మాధవరంలో జన్మించినప్పటికీ బాల్యం అమ్మమ్మ గ్రామమైన ముకుందాపురంలో కొనసాగిందని, ఈ రెండు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో మాధవరంలో 10 సీసీ కెమెరాలను సుమారు రూ.3లక్షల వ్యయంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ పందిరి కళావతి, ఎంపీటీసీ సభ్యురాలు నూకమళ్ల ఇందిర పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయాలి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట రూరల్: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కోరారు. ఆదివారం రాత్రి సూర్యాపేటలో కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 60 ఏళ్ల దీర్ఘకాలిక అభివృద్ధి జరిగిందన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ఒక్క గులాబీ జెండానే కారణమన్నారు. కేసీఆర్ లేకపోతే రాష్ట్రం ఏర్పాటు అయ్యేది కాదన్నారు. రాష్ట్రం ఏర్పాటు కావడం.. ఇతర రాష్ట్రాల నుంచి 30లక్షల మంది వలస వస్తే తెలంగాణ ఆతిథ్యం ఇస్తుందని తెలిపారు. పిట్టల దొర పీసీసీ అధ్యక్షుడు అయ్యారని విమర్శించారు. నాడు మూసీ ప్రాజెక్టుని పట్టించుకున్న నాథుడే లేరని, ఇప్పుడు ఒక్కగేటు పోతే మూడు రోజుల్లో పెట్టించానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వైవీ, ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్ నాయుడు, మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ముక్కముల పద్మ, వెంకటేశ్వరావు, ముదిరెడ్డి సంతోష్‌రెడ్డి, దశరథ, గాలిబ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

‘ముందుకు సాగు’దాం..



నల్లగొండ డెస్క్:
యాసంగి నాట్లు, కోతలు ఆలస్యమవడం వల్ల ప్రకృతి విపత్తులతో రైతులు పంటలను నష్టపోతున్నారు. దీన్ని నివారించేందుకు యాసంగితో పాటు వానాకాలం సాగు కాలాన్ని కూడా ముందుకు జరపాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. దీని వల్ల ఒనగూరే ప్రయోజనాలను రైతులకు వివరించాలని ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కలెక్టర్ల సమావేశంలో సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా సూచించారు. శనివారం నల్లగొండ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కూడా దీనిపై తీర్మానం చేశారు. ఈ నేపథ్యంలో రైతులు పంటల సాగును ఏ విధంగా ముందుకు జరుపుకోవాలి, అందుకు ఏ రకం విత్తనాలను ఎంచుకోవాలి, ఏ రకమైన పద్ధతులు పాటించాలన్న అంశాలపై కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త శ్రీనివాసరావు ‘సాక్షి’కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

వానాకాలం, యాసంగి సాగును ముందుకు జరుపుకోవాలని ప్రభుత్వం ఆదేశం మేరకు రైతులకు సూచిస్తున్నాం. వ్యవసాయ విశ్వవిద్యాలయం తరఫున కూడా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పంటకాలం ముందుకు జరుపుకోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాల నుంచి కొంత వరకు బయటపడవచ్చని రైతులకు వివరిస్తున్నాం. ప్రస్తుతం వానాకాలం సీజన్‌ను కొన్నిచోట్ల రైతులు ప్రారంభించారు. వరి సాగు చేపట్టే రైతులు అందరూ పనులు మొదలుపెట్టాలి.

సాధారణంగా వానాకాలంలో వరినాట్లు ఆగస్టు నెల వరకు వేస్తుంటారు. ఈ పంట దిగుబడి వచ్చే సమయంలో అంటే.. నవంబర్, డిసెంబర్‌లో వచ్చే తుపాన్లకు పంట దెబ్బతిని రైతు నష్టపోతున్నాడు. ఇలా కాకుండా మే నెల చివరలో గానీ, జూన్ రెండో వారంలోగా నారు పోసుకుని జూలైలో నాట్లు పూర్తి చేసుకుంటే తుపాన్లు అధికంగా వచ్చే సమయానికి పంట చేతికి వస్తుంది. అక్టోబర్‌లో పంట కోతకు వస్తుంది. దీంతో కొంత మేర నష్టం నుంచి బయటపడవచ్చు. సాగర్ ప్రాజెక్టు నీటిని ఆగస్టులో విడుదల చేస్తుంటారు. నీటి విడుదల లోగా బోర్ల ద్వారా నారు పెంచుకోవాలి. చెరువులు, రిజర్వాయర్ల కింద జూలైలో నీటిని విడుదల చేస్తారు. నాట్లు వేసే సమయానికి దాదాపు అంతటా నీరందుతుంది. నాన్ ఆయకట్టులో బోర్ల కింద ఎక్కువగా వరి సాగు చేస్తారు. మే, జూన్‌లో బోర్లలో కొంత నీరు తక్కువ వచ్చినప్పటికీ జూలైలో వర్షాలతో నీరు సరిపోతుంది.

యాసంగిలో అయితే..

యాసంగి పంటకు అక్టోబర్ చివరి వారం నుంచి వరి నార్లు పోసుకోవాలి. డిసెంబర్ మొదటి వారంలోగా నాట్లు పూర్తి చేసుకోవాలి. ఇలా అయితే మార్చి చివరి నాటికి కోతలు పూర్తవుతాయి కాబట్టి ఏప్రిల్‌లో వచ్చే అకాల వర్షాల నుంచి రైతులు తప్పించుకోవచ్చు. ప్రతి సంవత్సరం ప్రత్యేకించి కొన్ని మండలాల్లో అకాల వర్షాల వల్ల నష్టం జరుగుతోంది. ఆయా మండలాల రైతులు పంటను ముందుగా వేసుకోవాలి. 120, 130 రోజుల్లో దిగుబడి వచ్చే సీడ్‌ను ఎంచుకోవాలి. యాసంగి సీజన్‌లో నార్లు నవంబర్‌లో పోసుకుంటే చలికి కొన్ని సమస్యలు వస్తాయి. దాని నుంచి రక్షణ చర్యలు చేపట్టాలి. చలికి తట్టుకునే విత్తన రకాలను ఎంచుకోవాలి. నారుమళ్లపై పట్టాలు కప్పుకోవాలి. నారుమడి దమ్ము చేసినప్పుడు కోళ్ల ఎరువు, పశువుల ఎరువు వేసుకోవాలి. పొటాష్ సాధారణం కంటే కొద్దిగా ఎక్కువ వేయాలి. రైస్ మిల్లులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో పచ్చి ధాన్యం కొంటారు కాబట్టి ఆ ప్రాంతాల్లో రైతులకు పెద్దగా ఇబ్బంది ఉండడం లేదు. వారు అనుకూలమైన సమయంలో ఎప్పుడైనా నాట్లు వేసుకునే అవకాశం ఉంటుంది.

వెదజల్లే పద్ధతి బాగుంటుంది



కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

వరిలో నారు పెంచుకుని, నాట్లు వేసుకునే పద్ధతి కాకుండా దమ్ముచేసుకుని బురదలో విత్తనం వెదజల్లడం వల్ల సమయం కలిసివస్తుంది. డైరెక్ట్ సీడింగ్ పద్ధతి అంటారు. దీని వల్ల పంట సమయం కొంత ముందుకు జరుగుతుంది. ఏదైనా స్థానిక పరిస్థితులు, నీటి లభ్యతపై ఆధారపడి ఉంటుంది. ఈ అంశాలను చూసుకుని రైతులు వరిసాగును కనీసం 15 నుంచి 20 రోజులైనా ముందుగా చేపట్టాలి.

- వరి సాగు కాలాన్ని ముందుకు జరుపుకోవాలి
- వానాకాలం, యాసంగి సీజన్లలో కూడా ఇదే పద్ధతి పాటించాలి
- ప్రకృతి వైపరీత్యాల నుంచి బయటపడేందుకు ఇదే శరణ్యం
- స్వల్పకాలిక రకాలను ఎంచుకోవాలి
- స్థానిక పరిస్థితులు, నీటి లభ్యత చూసుకోవాలి
- కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

ఎరువుల యాజమాన్యం తప్పనిసరి

దీర్ఘకాలిక రకాలకు వేసుకునే ఎరువులను స్వల్పకాలిక రకాలకు వాడకూడదు. పంట ముందుగా సాగుచేసినప్పుడు రెగ్యులర్‌గా పంటను గమనిస్తూ ఉండాలి. ఎరువుల యాజమాన్యం తప్పక పాటించాలి. యూరియా శాతం ఎక్కువైతే తెగుళ్ల దాడి పెరిగే అవకాశం ఉంటుంది. ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు తీసుకోవాలి. నీటి యాజమాన్యం కూడా ముఖ్యం. వరిమడిలో నీరు నిండుగా పెట్టి యూరియా వేయవద్దు. నీరు చాలా తక్కువ ఉన్నప్పుడు అంటే.. బురద మాదిరిగా ఉన్నప్పుడే వేయాలి.

స్వల్పకాలిక వరి విత్తనాలు ఇవే..

- ఆర్‌ఎన్‌ఆర్–29325 (రాజేంద్రనగర్ వరి–5) 120 నుంచి 125 రోజులు పంట కాలం కలిగిన స్వల్ప కాలిక రకం. పొడవు, దొడ్డు గింజ రకం. హెక్టారుకు 70 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడిని ఇస్తుంది.
- తెలంగాణ సోన(ఆర్‌ఎస్‌ఆర్–15048) 125 రోజుల పంట కాలం కలిగిన స్వల్ప కాలిక రకం. జూలై మొదటి వారం తరువాత నారు పోసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. తక్కువ నూక శాతంతో బియ్యం నాణ్యతగా ఉంటాయి. హెక్టారుకు 60 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.
- కేఎన్‌ఎమ్–1638(కూనారం రవి–1) 125 నుంచి 130 రోజులు పంట కాలం కలిగిన స్వల్పకాలిక రకం. ఉల్లికోడు, అగ్గి తెగులును తట్టుకుంటుంది. వానాకాలం ఆలస్యంగా విత్తుకోవడానికి అనుకూలమైన వరి రకం. బియ్యం రుచితో కూడిన నాణ్యత కలిగి ఉంటాయి. హెక్టారుకు 70 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.
- కేఎన్‌ఎమ్–118(కూనారం సన్నాలు) 125 రోజులు పంట కాలం కలిగిన స్వల్ప కాలిక దొడ్డు రకం. ఇది ఎమ్‌టీయూ 1010 రకాన్ని పోలి ఉంటుంది. పంటపై గింజ రాలే శాతం తక్కువ ఉంటుంది. గింజ బరువు ఎక్కువగా ఉంటుంది. హెక్టారుకు 70 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.
- జేజీఎల్–24423(జగిత్యాల రైస్–1) 125 రోజుల పంట కాలం కలిగిన స్వల్పకాలిక వరి రకం. ఇది ఎమ్‌టీయూ 1010 రకానికి ప్రత్యామ్నాయ రకం. గింజ రాలే గుణం తక్కువ. హెక్టారుకు 70 నుంచి 82 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.
- జేజీఎల్–27356(జగిత్యాల వరి–3) 130 నుంచి 135 రోజులు పంట కాలం కలిగిన మధ్యకాలిక అతి సన్న గింజ వరి రకం. బియ్యం నాణ్యత కలిగి ఉంటాయి. హెక్టారుకు 70 నుంచి 75 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.
- **వానాకాలం, యాసంగి సీజన్లలోనూ వేసుకోవచ్చు**

ఫలం విషతుల్యం!

- మామిడి పండ్లను మాగపెట్టేందుకు మోతాదుకు మించి ఇథిలిన్ వాడకం
- నిషేధమున్నా విరివిగా వినియోగిస్తున్న వ్యాపారులు
- ఇటీవల ఐదుగురిపై కేసు



సూర్యాపేట జిల్లా కేంద్రంలో శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు (ఫైల్)

దురాజ్‌పల్లి (సూర్యాపేట): మామిడి పండ్లను మాగపెట్టేందుకు కొందరు వ్యాపారులు విషం నింపుతున్నారు. సాధారణంగా మామిడి మగ్గడానికి 5 రోజులు పడుతుంది. అయితే ఒక్కరోజులోనే వాటిని మాగబెట్టేందుకు జిల్లాలో వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. ఆహార భద్రత నిబంధనలకు విరుద్ధంగా అధిక మోతాదులో ఇథిలిన్‌ను వాడుతున్నారు. దీంతో మామిడి కాయలు ఒక్కరోజులోనే మగ్గి, బంగారు వర్ణంలోకి మారి నిగనిగలాడుతున్నాయి. కానీ దీని వాడకంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది.

విచ్చలవిడిగా వాడకం..

కాయలను మాగబెట్టేందుకు సహజ పద్ధతులు ఉన్నాయి. వాటివల్ల ఆలస్యం అవుతుందని వ్యాపారులు ఈ పద్ధతులను అనుసరించడం లేదు. ఎథేపాన్ పౌడర్ వాడకంతో కాయ ఒక్కరోజులోనే మాగడంతో వీటివైపే మొగ్గు చూపుతున్నారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ మీదుగా పెద్ద ఎత్తున ఈ కెమికల్స్‌ను సూర్యాపేట తరలిస్తున్నారు. జిల్లాలో ఏటా రూ.కోటి విలువైన ఎథేపాన్‌ను వాడుతున్నట్లు సమాచారం. చిన్నచిన్న పాకెట్లలో ఉన్న ఈ పౌడర్‌ను ముందుగా నీటిలో ముంచి, మామిడి కాయల బాక్స్‌లో వేసి ప్యాక్ చేస్తున్నారు. ఈ రసాయనం కారణంగా ఒక్కరోజులోనే కాయలు మొత్తం పండ్లుగా మారుతాయి. ఈ వ్యవహారం మొత్తం బహిరంగంగానే సాగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కాల్షియం కార్బైడ్, ఎథేపాన్, బిగ్‌పాన్ వంటి రసాయనాలతో పాటు చైనా నుంచి వస్తున్న రసాయనాలు చల్లి మామిడి రంగు మారుస్తున్నారు. ఆహార భద్రత నియమాల ప్రకారం 20 కేజీల మామిడి బాక్స్‌లో 5 గ్రాముల ఇథిలిన్ మాత్రమే వాడాలి. అది కూడా మామిడి పండ్లకు నేరుగా తాకకుండా చిన్న బాక్స్‌లో పెట్టి పండ్ల మధ్యలో ఉంచాలి. కానీ వ్యాపారులు ఇవేవీ పట్టించుకోకుండా ఒక్కో మామిడి పండ్ల బాక్స్‌లోనే 60 గ్రాముల నుంచి 80గ్రాముల వరకు ఇథిలిన్‌ను వాడుతున్నారు. ఇలాంటి వారిపై అధికారులు నేరుగా చర్యలు తీసుకునే అధికారం ఉన్నా.. శాంపిల్స్ పేరుతో హడావుడి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కేసులతోనే సరి..

జిల్లాలో మార్చి మొదటి వారం నుంచి మామిడి విక్రమాలు జరుగుతున్నాయి. అయితే నిబంధనలు పాటించని వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని చెపుతున్న అధికారులు వారి వ్యాపార దుకాణాలను మాత్రం సీజ్ చేయలేదు. అదే అలుసుగా తీసుకున్న వ్యాపారులు ఏ మాత్రం మార్పు లేకుండా యథేచ్ఛగా ఇథిలిన్ వాడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే నిబంధనలు పాటించని వ్యాపారుల దుకాణాలను సీజ్ చేసే హక్కు రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులకు మాత్రమే ఉందని, తమకు లేదని ఫుడ్‌సేఫ్టీ అధికారులు చెబుతున్నారు.

నిబంధనలు పాటించకుండా..

జిల్లా కేంద్రంలో ఇటీవల నిబంధనలు పాటించకుండా మోతాదుకు మించి ఇథిలిన్ వాడుతున్న ఐదుగురు మామిడి ట్రేడర్స్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. మామిడి కాయల విక్రయ కేంద్రాల్లో ఈ నెల 1న ఆహార భద్రతా అధికారులు తనిఖీలు చేసి ఇథిలిన్ వాడుతున్న మామిడి శాంపిల్స్‌ను టెస్టింగ్ కోసం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. ఈ నెల 25న రిపోర్ట్‌లో మోతాదుకు మించి ఇథిలిన్ వాడినట్లు తేలడంతో వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

యాదాద్రిలో నిత్యారాధనలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్య కైంకర్యాలుర శాస్త్రోక్తంగా జరిగాయి. స్వయంభూ పంచనారసింహులకు బిందే తీర్థం, ఆరాధన, బాలభోగం నిర్వహించారు. అనంతరం నిజాభిషేకం, సహస్రనామార్చన గావించి తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో వేద ఆశీర్వచన పూజలు జరిపించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

నూతనకల్‌లో అఖిలపక్షాల బంద్

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ క్షమాపణ చెప్పాలని డిమాండ్



నూతనకల్ మండల కేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నూతనకల్: దళిత సంఘాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ క్షమాపణ చెప్పాలని, న్యాయవాది యుగేందర్‌పై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నూతనకల్ మండలంలో బంద్ చేపట్టారు. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి నుండే పోలీసులు ప్రతిపక్ష, దళిత సంఘాల నాయకులను అదుపులోకి తీసుకోగా.. బంద్‌ను విజయవంతం చేసేందుకు బయటకు వచ్చిన అఖిలపక్షాల నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి సూర్యాపేట రూరల్, పెన్‌పహాడ్‌లోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలు ఆపలేరన్నారు. ఎమ్మెల్యే గాదరి కిశోర్ అనుచరుల ఆగడాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ మండల అధ్యక్షులు నాగం సుధాకర్‌రెడ్డి, మద్ది సంజీవరెడ్డి, పాల్వాయి సూరయ్య, మహేశ్వరం చంద్రకళ, బొడ్డుపల్లి అంజయ్య, నాగం జయసుధ, ఇమ్మారెడ్డి రాజాబహుదూర్‌రెడ్డి, బత్తిని వెంకటేష్, ఇమ్మారెడ్డి మహేష్‌రెడ్డి, ముత్యం ప్రసాద్, వీరమళ్ల మహేష్, నవీన్, యానాల వెంకట్‌రెడ్డి, దేవరకొండ సాయి, భాను తదితరులు పాల్గొన్నారు.